క్లుప్తంగా

శివస్వాములకు అన్నదానం



కల్వకుర్తిరూరల్: పట్టణంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం సహకారంతో సోమవారం అన్నదానం చేశారు. అంతకుముందు గురుస్వామి ఆనంద్‌గౌడ్ ఆధ్వర్యంలో శివపూజలు నిర్వహించారు. శివస్వాములతోపాటు హనుమాన్‌దీక్ష, అయ్యప్పమాల ధరించిన 50 మంది స్వాములు హాజరయ్యారు.

ఎంఈఓ ఆకస్మిక తనిఖీ



తాడూరు: మండలంలోని అల్లాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలను ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం అనీల్‌కుమార్‌రెడ్డి, హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

మర్రిపల్లిలో..

ఉప్పునుంతల: మండలంలోని మర్రిపల్లి ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ చంద్రశేఖర్ సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యా ప్రగతిని ఎంఈఓ పరిశీలించారు.

విద్యార్థికి చేయూత



కల్వకుర్తిరూరల్: ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ఇంజనీరింగ్ విద్యార్థి అక్షితకు క్లాస్‌మెట్ క్లబ్ డివిజన్ అధ్యక్షుడు రాజేందర్ సోమవారం కల్వకుర్తిలో రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో శ్రీధర్, రాఘవేందర్, కిషన్ డా నాగార్జున ఉన్నారు.

మండల కార్యదర్శిగా పొదిల రామయ్య

నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో సోమవారం సీపీఎం నాగర్‌కర్నూల్ మండల కార్యదర్శిగా పొదిలరామయ్యను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా కొంపల్లి అశోక్, నాగరాజుగౌడ్, సురేష్, తిరుపతయ్య, సురేందర్, ఈశ్వరమ్మలు ఎన్నికయ్యారు.

జాబ్ క్యాలెండర్ అమలు చేయాలి

కొల్లాపూర్: జాబ్ క్యాలెండర్ అమలు చేయాలని బీఆర్ఎస్‌వీ జిల్లా నాయకుడు డి.శేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి సంవత్సరం 2 లక్షల ఉద్యోగాలు భర్తీచేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఏడాది ఎన్ని ఉద్యోగాలు ఇచ్చిందో చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇచ్చి భర్తీ చేసిన పోస్టులు రూ.10 వేలు కూడా లేవన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా శేఖర్

ఉప్పునుంతల: మండలంలోని మామిళ్లపల్లికి చెందిన మొగిలిశేఖర్‌ను సమాచార హక్కు రక్షణ చట్టం- 2005 రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు సోమవారం జిల్లాలోని కల్వకుర్తిలో నిర్వహించిన సమాచార హక్కు రక్షణ చట్టం నాల్గో రాష్ట్ర మహాసభలో రాష్ట్ర నియామక ఇన్‌చార్జ్ చల్లమాళ్ల సుధాకర్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ భోజరాజు ప్రశాంత్ చేతులమీదుగా నియామక పత్రం అందుకున్నారు. రాష్ట్ర స్థాయిలో బాధ్యతను అప్పగించిన రాష్ట్ర కమిటీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కంపచెట్ల తొలగింపు



వెల్దండ: మండలంలోని కుప్పగండ్ల, పెద్దాపూర్ గ్రామాలకు వెళ్లే రోడ్డులో ఇరువైపులా ఉన్న కంపచెట్లను సోమవారం సింగిల్‌విండో డైరెక్టర్ శేఖర్ సొంత ఖర్చులతో తొలగించారు. రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు పెరగడంతో మూల మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించడపోవడంతో సొంతఖర్చులతో యంత్రాల సహాయంతో చెట్లను తొలగించినట్లు శేఖర్ తెలిపారు. దశరథం, శ్రీనివాస్ యాదవ్, లక్ష్మయ్య, మల్లేష్ ఉన్నారు.

ప్రమాదకరంగా దుందుభీ కాజ్‌వే



ధ్వంసమైన కాజ్‌వే బ్రిడ్జి

- వాహనదారులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు

తాడూరు: ప్రయాణికుల సౌకర్యార్థం దుందుభీపై కాజ్‌వేను నిర్మించారు. శిర్సవాడ నుంచి కల్వకుర్తి, జడ్చర్ల, నాగర్‌కర్నూల్ వెళ్లేందుకు ప్రధానమైన లింక్ రోడ్డు కావడంతో నిత్యం ఈ రహదారిపై వాహన రాకపోకలు కొనసాగుతున్నాయి. వరద ప్రవాహాల ధాటికి దుందుభీ నదిలో ఉన్న లోలెవల్ కాజ్‌వే శిథిలావస్థకు చేరి గుంతలమయంగా మారింది. బ్రిడ్జి నిర్మాణం కోసం ఎన్నో ఏళ్ల నుంచి మూడు నియోజకవర్గాల ప్రజలు ఎదురుచూస్తున్నారు.

దుందుభీ నదిలో ప్రమాదాలు ఇలా..

వర్షాకాలంలో వరదల ధాటికి దుందుభీ నది ప్రవాహం ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో పలువురు నది ప్రవాహానికి ప్రమాదాలబారిన పడి మృతి చెందిన ఘటనలు ఉన్నాయి. 2022వ సంవత్సరం జూలైలో నలుగురితో ప్రయాణిస్తున్న ఆటో ప్రమాదవశాత్తు అదుపుతప్పి కాజ్‌వే పై నుంచి కింద పడింది. గ్రామస్తుల సహాయంతో ఆటోలో ఉన్న వారిని ప్రాణాలతో రక్షించడంతో ఊపిరిపీల్చుకున్నారు. సెప్టెంబర్ 7, 2022న రాత్రివేళలో 28 మందితో ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సు శిర్సవాడ నుంచి కల్వకుర్తికి వెళ్తుండగా అదుపు తప్పి నదిలోకి దూసుకుపోయింది. గ్రామస్తుల సహాయంతో బస్సును బయటకు తీయడంతో ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. అదే ఏడాది అక్టోబర్ 14 శిర్సవాడకు చెందిన చిన్నపర్వతాలు తన వ్యవసాయ పొలం నుంచి ఇంటికి తిరిగి వస్తుండగా నది ప్రవాహంలో కొట్టుకుపోయారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాల ఆధ్వర్యంలో మూడు రోజులపాటు గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని గుర్తించారు. సెప్టెంబర్ 1వ తేదీన గ్రామానికి చెందిన ఇద్దరు గొర్రెల కాపరులు 200 గొర్రెలతో నదిలో చిక్కుకున్న ఘటన చోటుచేసుకుంది. కలెక్టర్, ఎస్పీ సమక్షంలో గొర్రెల కాపరులను, గొర్రెలను సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



దుందుభీ నదిపై నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారింది. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాకపోకలు కొనసాగడం లేదు. లోలెవల్ కాజ్‌వే బ్రిడ్జి పూర్తిగా ధ్వంసం అయ్యింది. ప్రతి సంవత్సరం ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

– అల్లోజి శిర్సవాడ

బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి



గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చెక్‌డ్యాంలు నిర్మించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి. ప్రమాదాలు జరిగినప్పుడు నామమాత్రంగా చర్యలు తీసుకుంటున్నారే తప్ప శాశ్వతంగా పనులు చేపట్టడం లేదు. పాలకులు బ్రిడ్జి నిర్మాణానికి నిధులు కేటాయించాలి. సమస్య వెంటనే పరిష్కరించాలి.

– బాలు శిర్సవాడ



దుందుభీ వాగు పరిస్థితిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి(ఫైల్)



గల్లంతైన వ్యక్తికోసం గాలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందాలు(ఫైల్)

ఆగిఉన్న బస్సును ఢీకొట్టిన ప్రైవేటు బస్సు



నిలిచి ఉన్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన ప్రైవేటు బస్సు

అచ్చంపేట రూరల్: ఆర్టీసీ బస్టాండులో ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును మరో ప్రైవేటు ఆర్టీసీ బస్సు సోమవారం రాత్రి ఢీకొట్టిన ఘటన చోటు చేసుకుంది. ప్రయాణికుల వివరాల ప్రకారం అచ్చంపేట ఆర్టీసీ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మద్దిమడుగు వెళ్లడానికి బస్టాండులో నిలిచింది. బస్టాండు ఆవరణలో చలివేంద్రం సమీపంలో నిలిపి ఉన్న ఆర్టీసీ ప్రైవేటు(అద్దె)బస్సు నెమ్మదిగా ముందుకు కదులుతూ నిలిపి ఉన్న బస్సును ఢీకొట్టింది. ఒక్కసారిగా శబ్దం రావడంతో ప్రయాణికులు ఉలిక్కిపడ్డారు. ప్రైవేటు బస్సు హ్యాండ్‌బ్రేక్ వేసినప్పటికీ కదులుతూ రావడం ఏంటని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగపోవడంతో అంతా ఊపరిపీల్చుకున్నారు. ఈ విషయమై ఆర్టీసీ డీఎం మురళీదుర్గాప్రసాద్‌ను వివరణ కోరగా ప్రైవేటు(అద్దె) బస్సును పార్కింగ్ చేసిన క్రమంలో స్వీపింగ్ చేసే వ్యక్తి హ్యాండ్‌బ్రేక్‌ను తగలడంతో నెమ్మదిగా బస్సు కదులుతూ మద్దిమడుగు వెళ్లే బస్సును ఢీకొట్టి ఉండొచ్చని పేర్కొన్నారు. బస్సుల కండీషన్‌ను పరిశీలిస్తున్నామని తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని వివరించారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

అచ్చంపేట: మండలంలోని పలకపల్లి గ్రామ పంచాయతీలో సుమారుగా రూ.35 లక్షల నిధులు దుర్వినియోగం చేసిన కార్యదర్శి కళావతిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచ్ వెంకటయ్య సోమవారం కలెక్టర్ బాదావత్ సంతోష్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. 2019 నుంచి 2022 వరకు విధులు నిర్వహించిన కార్యదర్శి అభివృద్ధి పనుల పేరుతో నిధులు డ్రా చేశారని వివరించారు.

విజయవంతం చేయండి

కొల్లాపూర్ రూరల్: ఈ నెల 7న జడ్చర్లలో నిర్వహించే ధర్మయుద్ధ సదస్సును విజయవంతం చేయాలని దండోరా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోళ్ల శివ మాదిగ కోరారు. సోమవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వర్గీకరణపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ధర్మయుద్ధ సదస్సు నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. దండోరా కార్యకర్తలు, నాయకులు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు.

నియామకపత్రాల పంపిణీ

కోడేరు: మండలంలో నూతన ఉపాధ్యాయులకు సోమవారం ఎంఈఓ భాస్కర్‌శర్మ నియామక పత్రాలు అందజేశారు. పస్పుల, కొండ్రావుపల్లి, ఎస్జీటీ పోస్టులను భర్తీ చేసినట్లు ఎంఈఓ తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

బిజినేపల్లి: మండలంలోని నందివడ్డెమాన్ గ్రామానికి చెందిన గుంటపల్లి తిరుపతయ్య గొంతులో గుడ్డు ఇరుక్కొని ఆదివారం మృతి చెందాడు. సోమవారం గ్రామానికి చెందిన శెట్టి రాజేష్‌కుమార్, జే. విష్ణువర్ధన్‌రెడ్డిలు బాధితకుటుంబాన్ని పరామర్శించి రూ. 5000 ఆర్థికసాయం అందజేశారు. నాయకులు ఊషన్న, వీరస్వామి, వేంకటేష్ ఉన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన



పెంట్లవెల్లి: ఐకేపీ వీఓఏల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ ఆధ్వర్యంలో మండల సమైక్య కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ శ్రీనిధి ప్రోత్సాహం పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. అనంతరం మహిళా మండల సమైక్య ఇన్‌చార్జ్ ఏపీఎం మంతమ్మకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో వెంకటేష్, వెంకటస్వామి, వసంత, మురళీ, మధు పాల్గొన్నారు.

యువకుడికి రిమాండ్

లింగాల: విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన లింగాలకు చెందిన యువకుడు ఎరుకలి వంశీకి సోమవారం కోర్టు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. ఇటీవల బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతూ నిందితుడు వంశీ పట్టుబడ్డాడు. ఘటన స్థలంలో పోలీసులతో దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించాడు. యువకుడిపై కేసు నమోదు చేసి అచ్చంపేట కోర్టులో హాజరుపర్చగా జడ్జి నిందితుడికి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

వృద్ధురాలిపై కోతుల దాడి

అచ్చంపేట రూరల్: ఓ వృద్ధురాలిపై కోతులు దాడి చేసి గాయపర్చిన ఘటన సోమవారం మండలంలోని హాజీపూర్‌లో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన దాసర్ల నాగమ్మ ఇంటి ముందు కూర్చుని ఉండగా ఒక్కసారిగా కోతుల సమూహం ఆకస్మాత్తుగా దాడి చేసింది. వృద్ధురాలి ముక్కు భాగాన్ని తీవ్రంగా గాయపరిచాయి. ఇరుగు పొరుగు వారు కేకలు వేయడంతో కోతులు పారిపోయాయి. స్థానికులు వృద్ధురాలిని 108 అంబులెన్స్‌లో అచ్చంపేట ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని, నాగర్‌కర్నూల్ ఆస్పత్రికి అటు నుంచి హైదరాబాద్‌కు తరలించారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



కల్వకుర్తిరూరల్: సదర్ ఉత్సవాలను రాష్ట్ర పండుగ హోదా కల్పిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని మండల యాదవ సంఘం నాయకులు స్వాగతించారు. ఈ సందర్భంగా సోమవారం ఆ సంఘం ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆనంద్, శ్రీకాంత్‌రెడ్డి, మిర్యాల శ్రీనివాస్‌రెడ్డి, రాహుల్, రేష్మాబేగం, సైదులుయాదవ్, పర్వతాలుయాదవ్, సంతూయాదవ్, వెంకటేషయాదవ్, గంగాధర్‌యాదవ్ పాల్గొన్నారు.

సగర సంఘం మండల కమిటీ ఎన్నిక

ఊర్కొండ: మండలంలోని ఊర్కొండపేటలో సగర సంఘం మండల కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఇంద్రాల సుధాకర్ సాగర్, ప్రధాన కార్యదర్శిగా బురుగుపల్లి భీముడు సాగర్, కోశాధికారిగా ఇంద్రాల నరేష్ సాగర్, గౌరవ అధ్యక్షుడిగా బూరుగుపల్లి రవీందర్ సాగర్, ఉపాధ్యక్షుడిగా ఇంద్రాల భాస్కర్, సహాయ కార్యదర్శిగా నార్ల కంటి శీను, ప్రచార కార్యదర్శి ఇంద్రాల సురేష్, సలహాదారులను, కార్యవర్గ సభ్యులు తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పడకండి రాజు సాగర్, వావిలాల భీమయ్య సాగర్ ఉన్నారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి



చారకొండ: ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సునీత పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి ఎలాంటి ఫిర్యాదులు అందలేదని తెలిపారు. ప్రజావాణికి ఆయా శాఖల అధికారులు హాజరయ్యారు. కార్యక్రమంలో డీటీ విద్యాధరి, ఆర్ఐ భరత్, రామకృష్ణ, ఏపీఎం బాలచందర్, ఏపీఎం లక్ష్మయ్య ఉన్నారు.

ఇంటింటికి సర్వే స్టికర్లు

చారకొండ: ఈనెల 6 నుంచి గ్రామాల్లో చేపట్టే సమగ్ర సర్వేకు మండలంలోని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు సంబంధిత అధికారులు ఇంటింటికి సర్వే చేపట్టేందుకు అవసరమయ్యే విధంగా సోమవారం ప్రతి ఇంటిని గుర్తించి స్టికర్లు అతికించారు. మండలంలోని శేరిఅప్పారెడ్డిపల్లిలో ఎంపీడీఓ పర్యటించి పరిశీలించారు. సోమవారం మండల వ్యాప్తంగా 4715 ఇళ్లకు స్టికర్లు అతికించినట్లు పేర్కొన్నారు. మంగళవారం ఇళ్ల స్టిక్కర్ల జాబితా సిద్ధం చేస్తామని ఎంపీడీఓ పేర్కొన్నారు.

శాంతినికేతన్ విద్యార్థులకు రాష్ట్రస్థాయి అవార్డు



తెలకపల్లి: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కళాఉత్సవ్ 2024 పోటీలలో మండల కేంద్రానికి చెందిన శాంతినికేతన్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారని ఆ పాఠశాల కరస్పాండెంట్‌లు సురేందర్‌రావు, ఇంద్రకుమార్, ప్రిన్స్‌పాల్ దీపా, సెబాస్టియన్ తెలిపారు. సెంటర్ ఫర్ కల్చరల్ రీసోర్స్ ట్రైనింగ్ సెంటర్ ఈ నెల 1, 2 తేదీలలో నిర్వహించిన పోటీలలో శాంతినికేతన్ పాఠశాలకు చెందిన 10వ తరగతికి చెందిన విద్యార్థులు వినోద్‌కుమార్, భరత్, అజయ్‌గౌడ్, 9వ తరగతికి చెందిన విద్యార్థులు చరన్ తేజ్, జశ్వంత్‌రెడ్డి పాల్గొని మైమ్(ముఖాభినయం) విభాగాలలో ప్రతిభ కనబర్చారు. రాష్ట్రస్థాయిలో 3వ స్థానంలో నిలిచారు. ఈ మేరకు సోమవారం విజేతలను పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్స్‌పాల్‌లు, ఉపాధ్యాయులు అభినందించారు.

పీఎస్ ఉపాధ్యాయులకు మాత్రమే సర్వే విధులు

లింగాల: మండలంలో ఈ నెల 6వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేలో ప్రాథమిక పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు మాత్రమే పాల్గొంటారని మండల విద్యాధికారి బషీర్ అహ్మద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక పాఠశాలలకు ఒక పూటబడి మాత్రమే ఉంటుందని పేర్కొన్నారు. ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు సర్వే విధులు ఉండవని పాఠశాలలు యథావిధిగా ఉంటాయని వివరించారు.

వసతిగృహంలో సమస్యలు పరిష్కరించాలని వినతి



వెల్దండ: మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతిగృహం, గిరిజన బాలికల వసతి గృహంలో నెలకొన్న వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ కార్తీక్‌కుమార్‌కు పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు సంతోష్, మల్లేష్, చింటు మాట్లాడుతూ గిరిజన బాలిక వసతి గృహానికి వెళ్లడానికి దారిలేకపోవడంతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. హాస్టల్ ఏఎన్ఎంను నియమించాలన్నారు. బీసీ బాలుర వసతి గృహంలో 150 విద్యార్థులకు కేవలం నాలుగు మాత్రమే మరుగుదొడ్లు ఉన్నాయని వివరించారు. గదులు శిథిలావస్థకు చేరుకున్నాయని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు స్పందన, శైలజ, కీర్తి, తదితరులు ఉన్నారు.

వరిధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఊర్కొండ: మండలంలోని ఊర్కొండపేట రైతువేదిక వద్ద వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఏఓ మానస ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వహిదొద్దీన్, నర్సిరెడ్డి, చంద్రయ్య, వెంకటయ్య, అరవింద్ గౌడ్, మల్లేష్, ఐకేపీ అధికారులు సునీల్, మాధవి రైతులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

తాడూరు: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లకు ఎంపిక చేయాలని డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు భరత్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని యాదిరెడ్డిపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలన్నారు. నియోజకవర్గానికి 3 వేలు ఇళ్లను కేటాయించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను దళిత వాడల అభివృద్ధి కోసమే ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు శివ, నాగరాజు, అనీల్, బాలు తదితరులు పాల్గొన్నారు.

ఊర్కొండ: వికలాంగులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని కోరుతూ వికలాంగుల సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మణ్ మండల కేంద్రంలో తహసీల్దార్ రాంకోటికి సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వికలాంగులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో కార్తీక మాసం పూజలు



అమ్రాబాద్ అమరేశ్వరాలయంలో భక్తుల పూజలు



పెద్దకొత్తపల్లిలో మంగళహారతులు ఇస్తున్న మహిళలు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో కార్తీకమాసం మొదటి సోమవారం పురస్కరించుకొని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా సోమశిలలో వెలసిన సోమేశ్వరాలయానికి ఉదయం నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. కృష్ణానదిలో భక్తులు స్నానాలు ఆచరించి లలితాంబికా సోమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

అమ్రాబాద్: కార్తీకమాసం పురస్కరించుకొని అమరేశ్వరాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ఆకాశదీపం వెలిగించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ అధ్యక్షుడు గంగిశెట్టి నాగరాజు, భక్తులు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సత్యనారాయణస్వామి వ్రతం ఆచరించారు. ఉదయం, సాయంత్రం వేళలో దీపోత్సవాన్ని నిర్వహించారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ



పెద్దకొత్తపల్లిలో చెక్కు పంపిణీ చేస్తున్న నాయకులు



పెంట్లవెల్లి మండలం జటప్రోల్‌లో చెక్ అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రానికి చెందిన దాదే చంద్రయ్యకు రూ. 60 వేలు, దండు రాములుకు రూ. 37500లు, ధనలక్ష్మికి రూ.25 వేలు సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి మంజూరయ్యాయి. ఈ మేరకు సోమవారం మాజీ ఎంపీటీసీ దండు నర్సింహ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తగిలి కృష్ణయ్యలు లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శశికళ శివశంకర్, దండు చంద్రయ్య, అశోక్‌రెడ్డి, ఎల్లయ్య, శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మయ్యలు పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: మండలంలోని జటప్రోల్ గ్రామానికి చెందిన మర్రికంటి గోవిందు, దామోదర్‌రెడ్డిలకు ఒక్కొక్కరికి రూ.25వేల చొప్పున సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరుకాగా మాజీ వైస్ ఎంపీపీ భీంరెడ్డి, నాగిరెడ్డిలు చెక్‌లు లబ్ధిదారులకు అందజేశారు. భీంరెడ్డి, నాగిరెడ్డి, నరేష్‌యాదవ్, బొజ్జన్న పాల్గొన్నారు.

ఇన్సెంటివ్ ఇవ్వాలని ఏపీఎంకు వినతి



నిరంజన్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఓఏలు

తెలకపల్లి: మండలంలో గ్రామస్థాయిలో పనిచేస్తున్న వీఓఏలకు వెంటనే ఇన్సెంటివ్ ఇవ్వాలని కోరుతూ సోమవారం వీఓఏలు ఐకేపీ ఏపీఎం నిరంజన్‌కువినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీఓఏలు మాట్లాడుతూ గ్రామ సమైక్యల నుంచి రావాల్సిన రూ.3 వేల వేతనాన్ని వీఓఏలకు వెంటనే చెల్లించాలని కోరారు. గ్రేడింగ్ పద్ధతిని రద్దు చేసి ప్రతి నెల 1వ తేదీన వేతనాలు ఇవ్వాలని కోరారు. వెంటనే బకాయిలు ఉన్న శ్రీనిధి ఇన్సెంటివ్ గ్రామ సంఘాలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీఓఏలు మల్లేష్, గిరిజ, విజయ తదితరులు పాల్గొన్నారు.

వెల్దండ: ఐకేపీలో భాగంగా మహిళాను బలోపేతం చేస్తున్న వీఓఏలకు ప్రభుత్వం కనీస వేతనం అందించాలని డిమాండ్ చేస్తున్న సోమవారం ఐకేపీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం ఏపీఎం రాములు నాయక్ వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వీఓఏ సంఘం జిల్లా నాయకులు చంద్రశేఖర్, మణిపాల్, మండల కార్యదర్శి వసంత, జహేదా, జ్యోతి, సత్యవతి, హైమావతి, సునిత, ధన్‌సింగ్, తదితరులు ఉన్నారు.

డబుల్‌బెడ్రూం ఇళ్లు కేటాయించాలని ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న లబ్ధిదారులు

కల్వకుర్తిరూరల్: డబుల్‌బెడ్రూం ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ డబుల్‌బెడ్రూం లబ్ధిదారుల పోరాట సంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల అధ్యక్షుడు ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు నర్సింహులు మాట్లాడుతూ లక్కీ డ్రిప్ ద్వార ఇళ్లు కేటాయించి 18 నెలలు కావొస్తున్న లబ్ధిదారులకు అప్పగించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు సంవత్సరాల కిందట ఇళ్లు పూర్తి అయ్యాయన్నారు. అధికారులు స్పందించి లబ్ధిదారులకు వెంటనే ఇళ్లు కేటాయించాలన్నారు. అనంతరం తహసీల్దార్ ఇబ్రహీంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తస్లీబేగం, పార్వతమ్మ, కృష్ణవేణి, భాగ్యలక్ష్మి, జయమ్మ, బాలకృష్ణ, వెంకటాచారి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అరెస్టులు కాదు.. పెండింగ్ బిల్లులు చెల్లించాలి

పాన్‌గల్: మాజీ సర్పంచ్‌లను అక్రమంగా అరెస్టు చేయడం కాదు... జీపీల్లో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని మండల మాజీ సర్పంచ్‌ల సంఘం డిమాండ్ చేసింది. జీపీల అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఆ సంఘం ఆధ్వర్యంలో చలో సెక్రెటరియేట్ కార్యక్రమానికి వెళ్లకుండా సోమవారం మండలంలోని వివిధ గ్రామాల మాజీ సర్పంచ్‌లను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. గతంలో అప్పులు చేసి జీపీల్లో అభివృద్ధి పనులు చేశామని, పదవీ కాలం పూర్తైనా బిల్లులు విడుదల కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వారు పేర్కొన్నారు.